క్లుప్తంగా

రేపు బహిరంగ వేలం

పాకాల: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరి చిప్పలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్, పాద రక్షలు భద్రపరుచు హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎస్.యువరాణి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఈఓ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేపు (జూలై 20వ తేదీ శనివారం) ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తారని, వేలం పాటలో పాల్గొనే అభ్యర్థులు రూ.1000 చెల్లించాలని, తలనీలాలు వేలంలో పాల్గొనే అభ్యర్థులు రూ.10,000 డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాట పూర్తి అయిన తరువాత హెచ్చు పాటదారు మొత్తం నగదును చెల్లించాలని వివరించారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంబీబీఎస్ ఫీజులపై మాట మార్చడం సరికాదు

తిరుపతి ఎడ్యుకేషన్: గత ప్రభుత్వం ఇచ్చిన జీఓలను రద్దు చేసి ఎంబీబీఎస్ ఫీజులను తగ్గిస్తామని చెప్పిన విద్యాశాఖ మంత్రి లోకేష్ నేడు ఆ విషయమై మాట మార్చడం సరికాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టగా, గత ఏడాది 5 వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయని, అయితే ఫీజులను అధికంగా వసూలు చేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ఫీజులకు సంబంధించిన అప్పటి ప్రభుత్వం జీఓను రద్దు చేస్తామని చెప్పి, నేడు హైకోర్టులో పాత ఫీజులనే కొనసాగిస్తామని మంత్రి లోకేష్ చెప్పడం ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందని విమర్శించారు. వెంటనే గత ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108జీఓలను రద్దు చేసి ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇన్‌చార్జి వీసీకి ఘన సన్మానం



ఇన్‌చార్జి వీసీని సన్మానిస్తున్న అధికారులు, బోధనేతర సిబ్బంది

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావును నాన్‌టీచింగ్ ఉద్యోగులు గురువారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో వారు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలుపుతూ దుశ్శాలువాతో సత్కరించారు. వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరాజు, నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి ఎస్.సుబ్రమణ్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంచినీళ్లగుంటను వినియోగంలోకి తీసుకొస్తాం

తిరుపతి(అలిపిరి): కలుషితంగా మారిన మంచినీళ్లగుంటను వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఉదయం మంచినీళ్లగుంటను ఆయన పరిశీలించారు. రుయా, స్విమ్స్ ఆస్పత్రుల నుంచి వచ్చే మెడికల్ వేస్టేజ్ మున్సిపల్ డ్రైనేజీలో కలవకుండా భూమిలో ఇంకిపోవడమే మంచినీళ్లగుంట అపరిశుభ్రతకు కారణమని .. కర్మక్రియలు నిర్వహించుకునేందుకు పాత గది ఇరుకుగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రుయా, స్విమ్స్ మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ డ్రైనేజీలో కలిపేలా.. కలుషితనీటిని శుద్ధి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.

రికార్డు స్థాయిలో మార్కెట్ వేలం

- కార్పొరేషన్‌కు భారీ ఆదాయం
- ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ రూ.3.21 కోట్లు
- పార్కింగ్ స్థలాలకు రూ.18,73,200



మార్కెట్ వేలం నిర్వహిస్తున్న నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: తిరుపతిలోని ఇందిరా ప్రిదయర్శిని కూరగాయల మార్కెట్‌కు నిర్వహించిన బహిరంగ వేలంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు భారీ ఆదాయం సమకూరింది. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నగరంలోని రెండు కూరగాయల మార్కెట్లు, మూడు ప్రాంతాల్లోని పార్కింగ్ స్థలాలకు బహిరంగ, సీల్డ్ కవర్‌లో వేలాన్ని నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్ పర్యవేక్షణలో నిర్వహించారు. వీటికి పదుల సంఖ్యలో పోటీ పడ్డారు. ఇందిరా ప్రియదర్శిని మార్కెట్‌కు అత్యధిక ధర పలికింది. అలానే రామచంద్ర పుష్కరిణి చిన్న కూరగాయల మార్కెట్ వేలం, జంతు వధ శాల (స్లాటర్ హౌస్)వేలంలో ఒక్కరు కూడా పాల్గొనలేదు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అదనపు కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్లు కేఎల్ వర్మ, సేతు మాధవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు పోటాపోటీ

పోటాపోటీగా సాగిన ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వేలంలో వై. గీత రికార్డు స్థాయిలో రూ.3.21కోట్లకు పాడి దక్కించుకున్నారు. ఇప్పుడు నిర్వహించిన వేలం కేవలం ఎనిమిది నెలలకు మాత్రమే (2024ఆగస్టు-2025 మార్చి). వాస్తవానికి మార్చిలో నిర్వహించాల్సిన మార్కెట్ల వేలం సార్వత్రిక ఎన్నికల మూలాన ఆలస్యమైంది. అలానే గాంధీరోడ్డు, తిలక్ రోడ్డు, మాస్క్ రోడ్డు, హరేరామ హరేకృష్ణ, కపిలతీర్థం రోడ్లకు సంబంధించిన పార్కింగ్ స్థలాల వేలాన్ని ప్రకాష్ అనే వ్యక్తి రూ.13,05,000, భారతి బస్టాండ్ పార్కింగ్ స్థలాన్ని శరత్‌బాబు అనే వ్యక్తి రూ.4,75,000, మునికృష్ణారెడ్డి అనే వ్యక్తి గోవిందరాజస్వామి మాడ వీధుల పార్కింగ్ స్థలాన్ని రూ.93,200కు దక్కించుకున్నారు.

పేదలకు అన్నదానం



రుయా ఆసుపత్రి అన్నదానం

తిరుపతి కల్చరల్: తిరుమల రాయల్ సారంగి హోటల్ అధినేత ప్రవీణ్ రాయల్ జన్మదినం సందర్భంగా రుయా ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. పలువురు స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రవీణ్‌రాయల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్నేహితులు ఇమామ్, ఎంఎస్ఆర్, ఇమ్రాన్ హాజరై అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ రాయల్ మిత్రులు నవీన్, కార్తీక్, బబ్బులు, ఆర్ఆర్.రాజేష్, అభిమానులు పాల్గొన్నారు.

ఎంపీపై దాడి అమానుషం

తిరుపతి కల్చరల్: సీనియర్ దళిత నేత, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై, ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు దాడి చేయడం అమానుషమని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో ఖండించారు. దుర్మార్గపు చర్యలతో దాడులకు పూనుకోవడం టీడీపీ అరాచకాలకు నిదర్శమని తెలిపారు.

దాడి హేయమైన చర్య

ఎంపీ మిథున్‌రెడ్డిపై, మాజీ ఎంపీ రెడ్డెప్పపై టీడీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లానిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి చర్యలకు పూనుకోవడం చాలా దురదృష్టకరమని, ఎంపీ మిథున్‌రెడ్డిపై రాళ్ల దాడి పిరికిపంద చర్య అని తెలిపారు.

అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్ ప్రారంభం



అపోలో డయాగ్నోస్టిక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ రోడ్డులోని ఎన్‌జీఓ కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రారంభించారు. అపోలో హెల్త్, లైఫ్ స్టైల్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరామ్ అయ్యర్ మాట్లాడుతూ అపోలో యూనిట్ ఐఎస్ఓ సర్టిఫికేషన్‌తో కూడిన ల్యాబ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అపోలో డయాగ్నోస్టిక్స్ సీఓఓ దేవేంద్ర సింగ్ రాజ్‌పుత్, అపోలో డయాగ్నోస్టిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పాకాల: పీహెచ్‌సీ ఆవరణలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో, కోర్ ఎన్‌జీఓస్ ప్రోగ్రాం మేనేజర్ సద్దాం సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కోర్ సంస్థ పీర్ ఎడ్యుకేటర్ బాలాజి మాట్లాడుతూ ఎఫ్ఎస్‌డబ్ల్యూఎస్, హెచ్‌ఆర్‌జీలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నిరోధ్ ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరవింద్, సూపర్‌వైజర్ భగవతి, కోర్ ఎన్జీఓ సభ్యులు, ఓఆర్‌డబ్ల్యూస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకోండి

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ బోర్డు నియమ, నిబంధనలను పాటించని తిరుపతి జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలను గుర్తించి వాటిని వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు నియమ, నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతూ విద్యాసంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చేస్తున్నారని, మరో వైపు ర్యాంకుల పేరుతో అదనపు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా హింసిస్తున్నారని దుయ్యబట్టారు. అనుమతి లేకుండా రెసిడెన్షియల్ పేరుతో కళాశాలలు నిర్వహిస్తూ ఉదయం 5నుంచి రాత్రి 10గంటల వరకు చదువు పేరుతో విద్యార్థులను మానసిక వేదనకు, ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. తద్వారా విద్యార్థులు మానసికంగా కుంగిపోయి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి అక్రమాలను వెంటనే అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఆర్ఐఓకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, తేజ పాల్గొన్నారు.

నిర్దేశిత ధరలకే కందిపప్పు, బియ్యం



వినియోగదారులకు కందిపప్పు అందిస్తున్న తహశీల్దార్ ఉషారాణి

రామచంద్రాపురం: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులను విక్రయించాలని తహశీల్దార్ ఉషారాణి అన్నారు. గురువారం మండలంలోని సీరామాపురంలోని జీఆర్కే దుకాణంలో నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందిపప్పు కేజీ రూ.160, నాణ్యమైన బియ్యం కేజీ రూ.49కి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్ఓ ప్రసాద్, సివిల్ సప్లయిస్ డీటీ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరుత కోసం గాలింపు

చంద్రగిరి: కొటాల జగనన్న కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో గత మూడు రోజులుగా చిరుత పులి సంచరిస్తూ స్థానిక కాలనీ వాసులను తీవ్రంగా భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ క్రమంలో చిరుత నుంచి ఎటువంటి హాని కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. గురువారం అటవీ అధికారులు చిరుత పులి పాద ముద్రలను గుర్తించారు. కొటాలతో పాటు పుల్లయ్యగారి పల్లి, రంగంపేట, నారావారిపల్లి ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు బాణాసంచా పేల్చుతూ, డప్పులు వాయిస్తూ చిరుత గ్రామాల్లోకి రాకుండా చర్యలను తీసుకుంటున్నారు. చిరుత జాడ కోసం ట్రాప్ కెమెరాలతో పాటు డ్రోన్ సాయంతో చిరుత కోసం గాలింపులను ముమ్మరం చేసినట్లు ఎఫ్ఆర్ఓ మాధవి తెలిపారు. రైతులు పొలాల వద్దకు వెళ్లేప్పుడు జాగ్రత్తలు పాటించాలని, రాత్రి వేళ రైతులు పొలాల వద్దకు వెళ్లకపోవడం మంచిదని సూచిస్తున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం ఎమ్మెల్సీ రవీంద్ర బాబు, తెలంగాణ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

బస్సుల కండిషన్ పరిశీలించండి



మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాలు వస్తున్నాయి. ముందస్తు ప్రణాళిక ప్రకారం బస్సులను పూర్తి కండిషన్‌లో ఉంచుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) చెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం తిరుపతిలోని తమ కార్యాలయంలో జిల్లాలోని 11 డిపోలకు చెందిన అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వెబ్‌కో కంపెనీ ప్రతినిధి సుమన్ బ్రేక్ సిస్టంకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహాలతోపాటు పలువురు మెకానిక్స్ పాల్గొన్నారు.

పురోహిత సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గౌతమ్‌శర్మ



గౌతమ్‌శర్మ

చంద్రగిరి: పురోహిత సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చంద్రగిరి కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకులు గౌతమ్‌శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాసలనాటి రామ్మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరులోని మొగిలి వద్ద నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని, బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన గౌతమ్‌శర్మ, రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ముగిసిన శ్రీగోవిందుని జ్యేష్టాభిషేకం



స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం



తిరుచ్చిపై దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో గత మూడు రోజులుగా చేపట్టిన జ్యేష్టాభిషేక మహోత్సవం గురువారంతో ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కవచాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. తర్వాత అర్చకులు శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను ఆలయంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి అక్కడ వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. కవచ ప్రతిష్ట, అక్షతారోహణం నిర్వహించి బ్రహ్మఘోష వినిపించారు. ఆస్థానం చేపట్టారు. తర్వాత కవచాలకు పూజలు, హారతి సమర్పించి స్వామి, అమ్మవార్లకు కవచ సమర్పణ చేశారు. సాయంత్రం ఉభయ నాంచారులతో కలిసి స్వామివారు తిరుచ్చిపై అధిరోహించి ఆలయ ప్రధాన వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ధనుంజయులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



కవచాలకు పూజలు, హారతి సమర్పణ

అన్నదానం కార్మికుల సమస్య పరిష్కారం

తిరుమల: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో విధులు నిర్వహించే ఎఫ్ఎంఎస్ కార్మికులు గత రెండు నెలలుగా జీతాలు అందలేదని గురువారం నాడు టీటీడీ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత కార్మికులతో జేఈఓ వీరబ్రహ్మం మాట్లాడుతూ సిబ్బంది జీతాలు సదరు బ్యాంకు ద్వారా వారి కాంట్రాక్టర్‌కు పంపించామన్నారు. ఇప్పటికే మొదటి బ్యాచ్ కార్మికులకు జీతాలు పంపించామని, శుక్రవారం రెండో బ్యాచ్ కార్మికుల జీతాలు అకౌంట్లో వేస్తామని తెలిపారు.

తిరుమల బాలాజీ భవన్ హోటల్ లైసెన్స్ రద్దు

తిరుమల: ఫీజు సకాలంలో చెల్లించని కారణంగా తిరుమలలోని తొమ్మిది పెద్ద హోటళ్ల(క్యాంటీన్)లో ఒకటైన, కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలోని బాలాజీ భవన్ హోటల్ లైసెన్స్‌ను టీటీడీ రద్దు చేసింది. ప్రస్తుతం హోటల్ చెల్లించవలసిన లైసెన్స్ ఫీజు రూ.76,04,196. ఇందుకు సంబంధించి జూన్ నెలలో సదరు హోటల్‌కు తుది నోటీసులు జారీ చేశారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా, లైసెన్సు ఫీజు చెల్లించనందుకు హోటల్ లైసెన్స్‌ను రద్దు చేశారు. టీటీడీ అధికారులు గురువారం హోటల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వేడుకగా శ్రీకపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



పంచమూర్తులకు స్నపన తిరుమంజనం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మూడు రోజులపాటు జరుగనున్న పవిత్రోత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో శ్రీకపిలేశ్వర స్వామి, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీవిఘ్నేశ్వరస్వామి, శ్రీసుబ్రహ్మణ్యస్వామి, శ్రీచండికేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పసుపు, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం రాకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణ వర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

లీజు గడువు ముగిసింది.. ఖాళీ చేయాల్సిందే



లీజు భూమిలో మిరప సాగు

భాకరాపేట: వ్యవసాయ భూమి లీజు ముగిసిందని, పంట సాగులో ఉన్నా వదిలేయాలని హెచ్చరించడంతో లీజుదారు ఎర్రావారిపాళెం పోలీసులను ఆశ్రయించాడు. రైతు ఈ విశ్వనాథరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రావారిపాళెం మండలం కమ్మల్ల పంచాయతీ కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు వై.మధుసూదన్ వద్ద నుండి 32 గుంటలు భూమిని లీజుకు తీసుకుని మిరప సాగు చేశాడు. అయితే వాతావరణ పరిస్థితులు కారణంగా పంట ఆలస్యంగా వచ్చింది. దీంతో లీజు సమయం అయిపోయిందని, లీజు భూమిని ఖాళీ చేయాలని మధుసూదన్ చెప్పాడు. దీంతో గ్రామ పెద్దలను ఆశ్రయించడంతో ఏడాదికి లీజు రూ.6000 కాకుండా మరో రూ.2000 పెంచి చెల్లించాలని తెలిపారు. అందుకు కూడా సమ్మతించి పంట కోతకు వెళితే మధుసూదన్ అడ్డుపడ్డాడు. పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదన్నారు. తాను వైఎస్ఆర్ సీపీ వార్డు మెంబర్‌ని కావడంతోనే పంట కోత చేయనీయకుండా అడ్డుపడుతున్నారని వాపోయారు. చేతికి వచ్చిన పంట కోత చేయకపోతే రూ.50 వేలు నష్టం వస్తుందని వాపోయారు. పోలీసులే న్యాయం చేయలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

తిరుపతి అర్బన్: మొక్కలను నాటడం ద్వారా పర్యావరణం పరిరక్షణ సాధ్యమవుతుందని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ గురువారం పేర్కొన్నారు. గురువారం టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు కలెక్టరేట్‌లో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషమని తెలిపారు. శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతంలో 50 వేల మొక్కలను నాటడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో టైమ్స్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సందీప్ సూద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా మొక్కలను నాటుతున్నామని... తిరుపతి జిల్లాలోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కలెక్టర్‌కు వెల్లడించారు.

సత్తా చాటిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు



మాస్టర్‌మైండ్స్ విద్యార్థులకు జ్ఞాపికల బహూకరణ

తిరుపతి ఎడ్యుకేషన్: సీఏ ఇంటర్, సీఏ ఫైనల్ ఫలితాల్లో ఆలిండియా 14, 37వ ర్యాంకులు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభినందించారు. సీఏ ఫైనల్ ఫలితాల్లో తిరుపతికి చెందిన విద్యార్థినులు కె.తేజశ్విని జాతీయ స్థాయి 14వ ర్యాంకు, వై.వర్షిత రెడ్డి 37వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో వీరిని అభినందించి సత్కరించారు. మాస్టర్‌మైండ్స్ తిరుపతి అడ్మిన్ ప్రిన్సిపల్ టి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మార్టం భవనం ప్రారంభం

చంద్రగిరి: ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన పోస్టుమార్టం భవనాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ముందుగా వినాయక స్వామికి పూజలు చేసి తర్వాత పోస్టుమార్టం గదిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భౌతిక కాయాలను తరలించేందుకు ఎంపీ నిధులతో వాహనం ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల సమస్యలపై అధికారులతో సమీక్షించారు. పార్టీలకు అతీతంగా పనిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ సూర్యసాయి, సీఐ రామయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలపై విచారించాలి



మాట్లాడుతున్న ఏపీ జూడో సంఘ నేత చీనేపల్లి కిరణ్‌కుమార్

తిరుపతి కల్చరల్: క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలకు పాల్పడిన వారు, క్రీడాకారులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న వారిపై విచారణ చేసి కేసు నమోదుతో సత్వర చర్యలు తీసుకోవాలని ఏపీ జూడో సంఘం కోశాధికారి చీనేపల్లి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఏపీ జూడో సంఘం అధ్యక్షుడిగా ఆనం రామకిషోర్‌రెడ్డిని గుర్తించారని తెలిపారు. వెంకట్ నామిశెట్టిని ఆర్థిక లావాదేవీల్లో జరిగిన అక్రమాలకు జేఎఫ్ఐ సస్పెండ్ చేసిందన్నారు. అయినా వెంకట్ నామిశెట్టి జూడో సంఘం తనదేనని, సీఈఓ అని చెప్పుకుంటూ జిల్లా సంఘాలకు గుర్తింపు ఇస్తామని లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెంటనే స్పందించి క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలకు పాల్పడుతున్న వారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు చిత్తూరు జిల్లా త్రోబాల్ సంఘం కార్యదర్శి ఇ.కిరణ్, సభ్యుడు ప్రదీప్ పాల్గొన్నారు.

ఉపాధి అందరికీ కల్పించండి

తిరుపతి అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధి పనులు అందరికీ కల్పించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 1.12 కోట్ల పనిదినాలు కల్పించాలని, నెల రోజుల లోపు 1.78లక్షల కుటుంబాలకు పనులు చూపించాలని ఆదేశించారు. సరాసరి కూలీ రూ.290కి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌కు సూచించారు.

నైపుణ్యం పెంపుతో నాణ్యమైన విద్య

- డీఈఓ శేఖర్

చంద్రగిరి(తిరుచానూరు): మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన పద్ధతుల్లో నైపుణ్యతను మెరుగుపరుచుకోవడం ద్వారా మరింత నాణ్యమైన విద్యను అందించవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ అన్నారు. సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(ఎస్ఏఎల్‌టి) ప్రాజెక్టులో భాగంగా టీచ్ టూల్ అబ్జర్వేషన్లపై తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణలో మారుతున్న బోధన పద్ధతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. డీవైఈఓ బాలాజీ, తిరుపతి రూరల్ మండల ఎంఈఓ దేవరాజు రెడ్డి, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి మధు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.